క్లుప్తంగా

నేడు వార్షికోత్సవం

పుంగనూరు: ఛత్రపతి శివాజీ పట్టాభిషేక జయంతి మహోత్సవాన్ని శుక్రవారం నిర్వహిస్తున్నట్లు హిందూజాగరణ సమితి సభ్యులు తెలిపారు. గురువారం వారు మాట్లాడుతూ ఛత్రపతి పట్టాభిషేక దినోత్సవాన్ని హిందూసామ్రాజ్య దినోత్సవంగా దేశంలో నిర్వహించడం ఎంతో అదృష్టమన్నారు. ఈ సందర్భంగా ఎన్ఎస్ పేటలో నుంచి శోభాయాత్ర పట్టణంలో నిర్వహించడం జరుగుతుందన్నారు. ప్రతి ఒక్కరూ పాల్గొని జయప్రదం చేయాలన్నారు.

వడగండ్ల వర్షం

పుంగనూరు: ఉరుములు, మెరుపులతో కూడిన వడగండ్లవాన గురువారం సాయంత్రం జనజీవనాన్ని స్తంభింపజేసింది. సాయంత్రం ప్రారంభమైన వర్షం తీవ్రంగా కురిసింది. వడగండ్లు పడడంతో మండలంలోని చంద్రమాకులపల్లె, మంగళం, మాదనపల్లె, చదళ్ల ప్రాంతాల్లో మామిడికాయలు నేలరాలాయి. అలాగే టమాటా పంటకు తీవ్ర నష్టం వాటిల్లింది. మున్సిపాలిటీ పరిధిలోని కాలువలు, వీధుల్లో వర్షపునీరు ప్రవహించడంతో మురుగునీటి కాలువలు శుభ్రమైంది.

బాలికల జూనియర్ కళాశాల ప్రారంభం



గ్రామాల్లో తల్లిదండ్రులతో మాట్లాడుతున్న అధ్యాపక బృందం

తవణంపల్లె: మండలంలోని అరగొండ బాలికల జూనియర్ కళాశాలను ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో గురువారం అరగొండ బాలికల ఉన్నత పాఠశాలలో సరస్వతీ దేవికి హెచ్ఎం రమాబాయి, అధ్యాపకులు, ఇంటర్ విద్యార్థులు పూజ చేసి తరగతులను ప్రారంభించారు. ఇంటర్మీడియట్‌లో బైపీసీ, ఎంపీసీ గ్రూపుల్లో విద్యార్థులను అడ్మిషన్లు చేస్తున్నట్లు హెచ్ఎం రాధాబాయి తెలిపారు. ఇంటర్ విద్యార్థులకు పాఠ్యాంశాలు బోధించడానికి అన్ని సబ్జెక్టులకు సంబంధించి ఏడుగురు అధ్యాపకులను ప్రభుత్వం నియమించిందని వివరించారు. మండలంలోని అన్ని ఉన్నత పాఠశాలల్లో చదివి పదవ తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు, తల్లిదండ్రులతో కలసి అవగాహన కల్పించి అడ్మిషన్లు చేయడానికి వారిచేత అంగీకార పత్రం నమోదు చేస్తున్నామని పేర్కొన్నారు. మండలంలోని బాలికలు ఇంటర్ చదవడానికి అనువుగా కళాశాల ఉండడంతో విద్యార్థులు సద్వినియోగం చేసుకొని కాలేజీలో చేరాలని కోరారు. విద్యార్థుల సంఖ్య పెంచడానికి అధ్యాపకులు బృందంతో గ్రామాల్లో తిరుగుతున్నామని తెలిపారు. కార్యక్రమంలో అధ్యాపకులు జయచంద్ర, మదనయ్య, చాన్‌బాషా, ధనలక్ష్మి, తిలక్, మమత, సోమశేఖర్ పాల్గొన్నారు.

బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనే ధ్యేయం



కొత్తబస్టాండ్‌లో అవగాహన కల్పిస్తున్న సీనియర్ సివిల్ జడ్జి కరుణకుమార్

చిత్తూరు కార్పొరేషన్: బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సీనియర్ సివిల్ జడ్జి కరుణకుమార్, జిల్లా కార్మిక శాఖాధికారి ఓంకార్‌రావు తెలిపారు. స్థానిక ఆర్టీసీ బస్టాండ్, రైల్వేస్టేషన్‌లో గురువారం బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనపై అవగాహన కల్పించారు. ఈ నెలలో జిల్లా వ్యాప్తంగా బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనకు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించనున్నట్లు వారు పేర్కొన్నారు. పిల్లలను పనిలో పెట్టుకుంటే వారిపై చట్టపరంగా చర్యలు తీసుకొని రూ.50 వేల వరకు జరిమానా విధిస్తామని హెచ్చరించారు. బడికి వెళ్లాల్సిన వయసులో పనికి వెళ్లడం తప్పని చెప్పారు. కార్యక్రమంలో డీఎం రూపశ్రీ, ఏఎల్ఓ జగదీష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.



రైల్వేస్టేషన్‌లో

వేడుకగా అర్జున తపస్మాన్



తపస్సుమాను ఎక్కుతున్న అర్జున వేషధారి

ఐరాల: మండలంలోని నాంపల్లె రెవెన్యూ గ్రా మంలో వెలసిన ద్రౌపదీ సమేత ధర్మరాజుల స్వామి ఆలయం వద్ద గురువారం అర్జున తపస్మాన్ కార్యక్రమాన్ని వేడుకగా నిర్వహించారు. నిర్వాహకులు తపస్సుమానుకు పూజలు చేసిన అనంతరం అర్జున వేషధారి తపస్మాన్ మెట్టు, మెట్టునూ అధిరోహిస్తూ శివుడి పాట లు, పద్యాలు ఆలపిస్తూ పైభాగానికి చేరుకున్నాడు. అక్కడి నుంచి అర్జున వేషధారి విసిరిన నిమ్మకాయలు, పండ్లు, పూలు మొదలైన వాటికోసం భక్తులు ఎగబడ్డారు.

ఎన్నికల కోసమే బాబు కాపీ హామీలు

- వైఎస్సార్ సీపీ మేనిఫెస్టోను అనుసరించిన టీడీపీ అధినేత
- ఇచ్చిన హామీలనే నెరవేర్చక మళ్లీ వంచనకు సిద్ధమయ్యాడు
- బాబుకు గుణపాఠం చెప్పండి
- జగనన్న సంక్షేమ పాలనకు మళ్లీ పట్టం కట్టండి
- ఎమ్మెల్యే వెంకటేగౌడ, ఎంపీ రెడ్డెప్ప, జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, ఎమ్మెల్సీ భరత్ పిలుపు



లబ్ధిదారునికి సంక్షేమ బుక్‌లెట్‌ను ఇస్తున్న ఎమ్మెల్యే వెంకటేగౌడ, జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు



గడప గడపలో పాల్గొనేందుకు వచ్చిన ఎమ్మెల్సీ, ఎంపీకి స్వాగతం పలుకుతున్న ఎమ్మెల్యే

వి.కోట: మేనిఫెస్టోలో ప్రకటించిన హామీలను అధికారంలోకి రాగానే నెరవేర్చి, ప్రజల మన్ననలు చూరగొన్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అయితే, హామీలను నెరవేర్చక ప్రజలను వంచించిన చరిత్ర చంద్రబాబుదని చిత్తూరు ఎంపీ రెడ్డెప్ప, పలమనేరు ఎమ్మెల్యే వెంకటేగౌడ, ఎమ్మెల్సీ భరత్ మండిపడ్డారు. ప్రజాదరణ పొందిన తమ పార్టీ పథకాలనే కాపీ కొట్టిన చంద్రబాబు టీడీపీ మహానాడులో ప్రకటించడం నవ్వుల పాలయ్యాడని అపహాస్యం చేశారు. రాబోవు ఎన్నికల్లో మళ్లీ ప్రజలను దగా చేసేందుకు వస్తున్న చంద్రబాబుకు ప్రజలే తగిన గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు. గురువారం దిగువ గంధారమాకులపల్లె, ఎగువ గంధారమాకులపల్లె, వీరాపురం, పడిగెలకుప్పం, జేబీ కొత్తూరు, విజయనగరం, కావలివంగ గ్రామాల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఎమ్మెల్యే నిర్వహించారు. ఎంపీ, ఎమ్మెల్సీ, జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. 768 గృహాలను సందర్శించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. లబ్ధిదారులు పొందిన సంక్షేమ పథకాల లబ్ధిని బుక్‌లెట్లతో వివరించారు. సమస్యలపై ఆరా తీశారు. గతంలో ఏ ప్రభుత్వం చేయని విధంగా జగనన్న ప్రభుత్వం పథకాల ఫలాలను ఇళ్ల దరికే చేరుస్తోందని, అర్హతే ప్రామాణికంగా అందజేస్తోందన్నారు. టీడీపీ పాలనలో కాళ్లరిగిగేలా ప్రదక్షిణలు చేసినా పథకాలు అర్హులకు అందేవి కావని, ప్రస్తుతం తమ ప్రభుత్వ పాలనలో సిఫార్సులు లేకుండా అన్నీ అందుతున్నాయని ప్రజలే చెబుతున్నారన్నారు.

లక్షలాది రూపాయల లబ్ధి

జగనన్న ప్రభుత్వ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి అర్హత కలిగిన ప్రతి కుటుంబమూ లక్షలాది రూపాయల లబ్ధి పొందడంతో ఆర్థికంగా ముందుకెళ్తున్నాయని ఎమ్మెల్యే చెప్పారు. అర్హత ఉన్ననూ సాంకేతిక కారణాలవల్ల అర్హులకు పథకాలు అందని పక్షంలో వలంటీర్ల వద్ద తిరిగి దరఖాస్తు చేసుకోవాలని కోరారు. స్థానికులు నివేదించిన సమస్యలపై ఎమ్మెల్యే స్పందించారు. సంబంధిత అధికారులు వాటిని పరిష్కరించాలని ఆదేశించారు.

థ్యాంక్స్ ఎమ్మెల్యే సార్!

గంధారమాకులపల్లె, జేబీ కొత్తూరుకు గతంలో ఇచ్చిన హామీల మేరకు ఎమ్మెల్యే, ప్రధాన రహదారి నిర్మించి పూర్తి చేసినందుకు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ యువరాజు, వైస్ ఎంపీపీ తమీమ్, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి పీఎస్ నాగరాజు, పార్టీ మండల కన్వీనర్ బాల గురునాథ్, సర్పంచ్ అనితారెడ్డి, ఎంపీటీసీ కమల్, జేసీఎస్ మండల కన్వీనర్ కిషోర్, పీఏసీఎస్ చైర్మన్లు, రెస్కో డైరెక్టర్ భూపతి, నాయకులు జయరామిరెడ్డి, కృష్ణమూర్తి, ప్రతాప్‌రెడ్డి, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

బలిజలకు 'బాబు' చేసింది శూన్యం



సమావేశంలో మాట్లాడుతున్న జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు చిత్రంలో ఎంపీ రెడ్డెప్ప, ఎమ్మెల్సీ భరత్

- బలిజలకు వైఎస్సార్ సీపీ చేయూత
- కార్పొరేషన్ నుంచి బలిజ భవనానికి రూ.కోటి మంజూరు
- జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు

కుప్పం: 14 ఏళ్లుగా ముఖ్యమంత్రిగా ఉన్నప్పటికీ చంద్రబాబునాయుడు బలిజ సామాజిక వర్గానికి చేసిందేమీ లేదని జిల్లా పరిషత్ చైర్మన్ గోవిందప్ప శ్రీనివాసులు విమర్శించారు. బలిజ భవన్ నిర్మాణానికి రూ.25 లక్షల జెడ్పీ నిధులు మంజూరు చేశారు. భవన్‌కు సంబంధించి ప్రహరీగోడ నిర్మాణానికి గురువారం ఆయన భూమి పూజ చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కూరలో కరివేపాకులా బలిజలను ఎన్నికల సమయంలో ఓట్ల కోసం చంద్రబాబు వాడుకున్నారని, వారికి చేసింది శూన్యమన్నారు. అనంతరం ఎంపీ రెడ్డెప్ప, ఎమ్మెల్సీ భరత్ మాట్లాడారు. 2 ఎకరాల స్థలాన్ని బలిజ భవన్‌కు కేటాయిస్తున్నట్లు ప్రకటించి బాబు తన హయాంలో వివాదాలు సృష్టించారని, అయితే వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన తరువాత కోర్టు వివాదాన్ని పరిష్కరించి, స్థలాన్ని బలిజ సామాజిక వర్గానికి కేటాయించామన్నారు. ఈ స్థలంలో శ్రీకృష్ణదేవరాయల విగ్రహ ప్రతిష్టాపనకు మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఎంతో కృషి చేశారని గుర్తు చేశారు. భవన నిర్మాణానికి తనవంతు సాయం చేస్తానని ఎంపీ ప్రకటించారు. టీటీడీ బోర్డు సభ్యుడు పోకల అశోక్‌కుమార్ మాట్లాడుతూ, నియోజక వర్గంలోని బలిజ కులస్తులు 25 వేల మంది ఉన్నారని, వీరికి గుర్తింపు తెచ్చేందుకు స్థలం కేటాయింపుతో పాటు కమ్యూనిటీ భవనం నిర్మాణానికి కృషి చేస్తామన్నారు. రాష్ట్రంలోని బలిజ కులస్తులకు ప్రాధాన్యతనిచ్చిన ఏకైక నాయకుడు జగన్‌మోహన్‌రెడ్డి అని, ఇప్పటివరకు ఈ సామాజిక వర్గాల భవనాల కోసం 4 కోట్ల రూపాయలను రాష్ట్రవ్యాప్తంగా విడుదల చేశారన్నారు. రాష్ట్ర కాపు కార్పొరేషన్ చైర్మన్ అడపా శేషు మాట్లాడుతూ, ఏ సాయం కావాలన్నా చేసేందుకు సిద్ధమన్నారు. భవనానికి సంబంధించి విద్యుత్ సరఫరాకు అయ్యే మొత్తం ఖర్చు భరిస్తామని రెస్కో చైర్మన్ సెంథిల్ కుమార్ ప్రకటించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ డాక్టర్ సుధీర్, నందకుమార్, విజయ్‌కుమార్, అస్వత్, బాల గురునాథ్, వెంకటరామయ్య, చలపతి, చీలేపల్లి రవి, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

పేద విద్యార్థుల కోసమే విద్యాకానుక



జగనన్న విద్యాకానుక కిట్లను పరిశీలిస్తున్న కడప ప్రాంతీయ సంచాలకులు వెంకట కృష్ణారెడ్డి

రొంపిచెర్ల: ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న పేద విద్యార్థులకు ప్రభుత్వం జగనన్న విద్యాకానుకను మంజూరు చేసిందని కడప రీజినల్ సంచాలకులు వెంకట కృష్ణారెడ్డి అన్నారు. ఆయన గురువారం రొంపిచెర్ల బాలుర ఉన్నత పాఠశాలలో జగనన్న విద్యాకానుక కిట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలల పునఃప్రారంభం రోజునే విద్యార్థులకు జగనన్న విద్యాకానుక కిట్లను విద్యార్థులకు పంపిణీ చేస్తామని చెప్పారు. స్కూల్ కిట్‌లోని యూనిఫాం, బ్యాగుల నాణ్యతను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. 85 శాతం పాఠ్యపుస్తకాలు కూడా మండల కేంద్రాలకు చేరాయని చెప్పారు. మిగిలిన పాఠ్యపుస్తకాలను కూడా త్వరలోనే ఇస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఎంఈఓ హాసన్‌బాషా, హెచ్ఎం శ్రీరాములు, సీఆర్పీలు అనసూయ, కిరణ్, రాజేంద్ర తదితరులు పాల్గొన్నారు.

8న ఎంపీపీ, 2వ వైస్ ఎంపీపీ ఎన్నిక

రామకుప్పం: స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో ఈ నెల 8న గురువారం ఉదయం 11 గంటలకు ఎంపీపీ, రెండవ వైస్ ఎంపీపీ ఎన్నికలు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ రాధాకృష్ణ తెలిపారు. ఎన్నికల అధికారిగా ఆర్‌డబ్ల్యూఎస్ డీఈఈ పురుషోత్తం వ్యవహరించనున్నట్లు చెప్పారు. ఈ ప్రత్యేక సమావేశానికి మండలంలోని ఎంపీటీసీ సభ్యులందరూ హాజరు కావాలని కోరారు.

గాయపడిన యువకుడి మృతి



మృతి చెందిన గణేష్

రొంపిచెర్ల: రోడ్డు ప్రమాదంలో గాయపడిన గణేష్(16) రుయా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గురువారం ఉదయం మృతి చెందినట్లు ఎస్ఐ శ్రీనివాస్ తెలిపారు. గత నెల 27వ తేదీ శనివారం రాత్రి రొంపిచెర్లకు చెందిన ముగ్గురు స్నేహితులు ద్విచక్ర వాహనంలో పీలేరుకు వెళ్తుతూ మటోళ్లపల్లె వద్ద అదుపు కింద తప్పి పడ్డారు. ఈ ప్రమాదంలో జావిద్ (27) మృతి చెందగా, సల్మాన్, గణేష్ గాయ పడిన విషయం తెలిసిందే. చికిత్స నిమిత్తం వీరిని తిరుపతి రుయాకు తరలించారు. అక్కడ గణేష్ చికిత్స పొందుతూ మృతి చెందారు.

ఇరువర్గాల ఘర్షణ

సోమల: ఇంటి స్థలం విషయంలో ఇరువర్గాలు ఘర్షణ పడడంతో రెండు వర్గాల వారిపై కేసులు నమోదు చేసినట్లు హెడ్‌కానిస్టేబుల్ మునిప్రసాద్ గురువారం తెలిపారు. వివరాలు.. మండలంలోని ఇరికిపెంట పంచాయతీ ఎస్.నడింపల్లె వారు, ఎమ్మెవారిపల్లెకు చెందిన వారితో ఇంటి స్థలం విషయంలో గొడవ పడ్డారు. ఈ ఘర్షణలో రక్త గాయాలు కావడంతో గోసల నవీన్ వర్గీయులు పీలేరు ప్రభుత్వాస్పత్రిలో చేరారు. మరో వర్గమైన అక్కులప్ప మనుషులు పుంగనూరు ప్రభుత్వాస్పత్రిలో చేరి చికిత్స పొందుతున్నారు. ఇరువర్గాల వారి ఫిర్యాదు మేరకు కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్‌కానిస్టేబుల్ తెలిపారు.

పైపులైన్ పనులు ప్రారంభం



పైపులైన్ పనులను పరిశీలిస్తున్న చైర్మన్ అలీమ్‌బాషా, కమిషనర్ నరసింహ ప్రసాద్‌రెడ్డి

పుంగనూరు: మున్సిపాలిటీలోని 27వ వార్డులోని రాంనగర్ ప్రాంతంలో పైపులైన్ పనులను మున్సిపల్ చైర్మన్ అలీమ్‌బాషా, కమిషనర్ నరసింహప్రసాద్‌రెడ్డి ప్రారంభించారు. గురువారం చైర్మన్ ఆ ప్రాంతాన్ని పరిశీలించి పైపులైన్ వేసే పనులను పర్యవేక్షించారు. అనంతరం చైర్మన్ మాట్లాడుతూ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఆదేశాల మేరకు విస్తరణ ప్రాంతాల్లో కాలువ పనులు, పైపులైన్లు వేస్తున్నామని తెలిపారు. అలాగే ప్రజలకు అవసరమైన ప్రాంతాల్లో కొళాయిలు ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. పనులను నాణ్యతగా చేపట్టాలని ఆదేశించారు. కార్యక్రమంలో డీఈఈ మహేష్, కౌన్సిలర్ నూర్జహాన్, నాయకులు ఖాన్, రమణ, సలామత్, అస్లాం, అమ్ముకుట్టి పాల్గొన్నారు.

వేరుశనగ విత్తనాల పంపిణీ



చెంచెంరెడ్డిగారిపల్లెలో ..



విత్తనకాలను పంపిణీ చేస్తున్న నాయకులు

రొంపిచెర్ల: ప్రభుత్వం సబ్సిడీతో అందిస్తున్న వేరుశనగ విత్తనకాయలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని చెంచెంరెడ్డిగారిపల్లె సర్పంచ్ సుధారాణి అన్నారు. గురువారం ఆమె స్థానిక రైతు భరోసా కేంద్రంలో సబ్సిడీ వేరుశనగ విత్తనకాలను రైతులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు రామనారాయణ రెడ్డి, రవీంద్ర, నాయకులు సూర్య నారాయణ రెడ్డి, రాజేంద్రరెడ్డి, అమరనాథరెడ్డి, చంద్రారెడ్డి, రమేష్, వ్యవసాయ సహాయకులు సుభాషిణి పాల్గొన్నారు.

వెంకట దాసరపల్లెలో..

పులిచెర్ల(కల్లూరు): మండలంలోని వెంకట దాసరపల్లె రైతు భరోసా కేంద్రంలో గురువారం రైతులకు సబ్సిడీపై వేరుశనగ విత్తనకాయలను పంపిణీ చేశారు. ఖరీఫ్‌లో వర్షాధార పంటగా రైతులు వేరుశనగ పంట సాగు చేస్తారు. ఈ నేపథ్యంలోనే ప్రభుత్వం సబ్సిడీ వేరుశనగ విత్తనకాయలను పంపిణీ చేస్తోంది. కార్యక్రమంలో ఎంపీటీసీ పోకల చంద్ర, నాదమునిరెడ్డి, దామోదర్, వెంకటాచలపతి, ద్వారక తదితరులు పాల్గొన్నారు.

సబ్‌స్టేషన్‌కు భూమిపూజ



భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాసులు

చిత్తూరు కార్పొరేషన్: స్థానిక అనుప్పల్లె జగనన్న హౌసింగ్ కాలనీలో నూతనంగా నిర్మించనున్న సబ్‌స్టేషన్‌కు గురువారం ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు భూమిపూజ చేశారు. జగనన్న కాలనీలో సబ్‌స్టేషన్ ఏర్పాటు చేయడం ఆనందంగా ఉందని ఎమ్మెల్యే తెలిపారు. ఈ కాలనీతోపాటు చుట్టు పక్కల ప్రాంతాలకు మెరుగైన విద్యుత్ సరఫరా భవిష్యత్‌లో ఇస్తామన్నారు. చిత్తూరు నగరంలో బాలంబట్టు, గుడిపాలలో బొమ్మసముద్రం, జీడీనెల్లూరు నియోజకవర్గంలోని బాలగంగనపల్లె ప్రాంతంలో సబ్‌స్టేషన్లకు త్వరలో భూమిపూజ చేయనున్నట్లు ట్రాన్స్‌కో ఈఈ పద్మనాభపిళ్లై తెలిపారు. ఒక్కొక్క సబ్‌స్టేషన్‌ను దాదాపు రూ.2 కోట్ల వ్యయంతో నిర్మించనున్నట్లు వివరించారు. కార్యక్రమంలో మేయర్ అముద తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి మహాభారత ఉత్సవాలు

కార్వేటినగరం: మండల పరిధిలోని కొల్లాగుంట గ్రామంలో ద్రౌపదీ సమేత ధర్మరాజుల ఆలయంలో శుక్రవారం నుంచి మహాభారత ఉత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ ధర్మకర్తలు తెలిపారు. గురువారం వారు స్థానిక విలేకరులతో మాట్లాడుతూ 2వ తేదీ నుంచి 11 వరకు వార్షిక మహాభారత ఉత్సవాల్లో భాగంగా ప్రతి రోజూ పగలు 1.30 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు భాగవతారణి సీతాలక్ష్మి వారిచే హరికథా కాలక్షేపం ఉంటుందన్నారు. అదేవిధంగా శుక్రవారం నుంచి శ్రీకృష్ణార్జున నాట్య కళామండలి మేనేజర్ మునిశంకర్, గుణ బృందం వారిచే మహాభారతం నాటకం ప్రదర్శన ఉంటుందన్నారు. 2వ తేదీ బలి బండి కూడు, 4వ తేదీ బకాసుర వధ, 6వ తేదీ ద్రౌపదీ మాన సంరక్షణ, 7 తపస్సు, 11వ తేదీ ఆదివారం ఉదయం దుర్యోధన వధ, రాత్రి అగ్నిగుండ ప్రవేశం ఉంటుందని తెలిపారు. సోమవారం ధర్మరాజుల పట్టాభిషేకం కార్యక్రమాన్ని అట్టహాసంగా నిర్వహిస్తామన్నారు. ఈ సందర్భంగా ఆలయాన్ని విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించారు.

మంత్రి పెద్దిరెడ్డి చొరవతో మండలాభివృద్ధి



సదుం: మాట్లాడుతున్న ఎంపీపీ ఎల్లప్ప

సదుం: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం తరువాత ఈ నాలుగేళ్లలో మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి చొరవతో మండలంలో ఊహించనంత అభివృద్ధి జరిగిందని ఎంపీపీ ఎల్లప్ప, జెడ్పీటీసీ సభ్యుడు సోమశేఖర్‌రెడ్డి తెలిపారు. ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ అధ్యక్షతన గురువారం సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. గ్రామాల్లో ప్రభుత్వ భవనాలు, సీసీ రోడ్ల నిర్మాణాలు పెద్ద ఎత్తున చేపట్టడం జరిగిందన్నారు. తాగునీటి సమస్య పరిష్కారానికి ప్రతి గ్రామంలో ఓవర్ హెడ్ ట్యాంకుల నిర్మాణం పూర్తయినట్టు వారు చెప్పారు. రాకపోకలకు వీలుగా వంతెనల నిర్మాణం కొనసాగుతున్నట్టు తెలిపారు. గ్రామాల్లో పలుచోట్ల వీధిదీపాల ఏర్పాటులో ఫిర్యాదులు వస్తున్నాయని, వాటిని సర్పంచ్‌లు పరిష్కరించాలని సూచించారు. మండల కేంద్రంలో నిర్మాణంలో ఉన్న ఆస్పత్రి త్వరలోనే ప్రారంభం కానుందన్నారు. ఆస్పత్రి ప్రారంభమైతే పేదలకు మెరుగైన వైద్యసేవలు అందుతాయని చెప్పారు. గతంలో పెండింగ్‌లో ఉన్న తాగునీటి సరఫరా బిల్లులు 15 రోజుల్లోపు అందనున్నట్టు తెలిపారు. సచివాలయాల్లో మెరుగైన సేవలు అందించాలని కోరారు. కార్యక్రమంలో తహసీల్దారు చంద్రశేఖర్, ఎంపీడీఓ వరప్రసాద్, సింగిల్‌విండో చైర్మన్ తిమ్మారెడ్డి, వైస్ ఎంపీపీ అమరావతి, ఏఎంసీ వైస్ చైర్మన్ శివారెడ్డి, ఏఓ హరిప్రసాద్, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

శరవేగంగా పింఛన్ల పంపిణీ





స్విమ్స్‌లో పింఛన్ అందజేస్తున్న వలంటీర్ నస్రీన్, సదుంలో పింఛన్ పంపిణీ చేస్తున్న వలంటీర్

పుంగనూరు: పట్టణంలో గురువారం వేకువజామున నుంచే పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రారంభించారు. పట్టణంలోని కొత్తపేటలో మున్సిపల్ చైర్మన్ అలీమ్‌బాషా, కమిషనర్ నరసింహప్రసాద్‌రెడ్డి పింఛన్లను పంపిణీ చేశారు. మేలుపట్లలో వైస్ చైర్మన్ సీఆర్ లలిత పెన్షన్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. అలాగే ఉబేదుల్లా కాంపౌండులో వక్ఫ్ బోర్డు చైర్మన్ అమ్ము పలువురు లబ్ధిదారులకు పింఛన్ అందించారు. మండలంలోని మంగళం గ్రామంలో ఎంపీపీ అక్కిసాని భాస్కర్‌రెడ్డి పింఛన్ల పంపిణీని ప్రారంభించారు. పట్టణం, మండలంలో వలంటీర్లు సుమారు 97 శాతం పెన్షన్ల పంపిణీ పూర్తి చేశారు. కౌన్సిలర్లు నరసింహులు, మమత, రేష్మా, సాజిదా బేగం, నయాంతాజ్, అర్షద్ అలీ, పూలత్యాగరాజు, భారతి, జయభారతి పాల్గొన్నారు.

స్విమ్స్‌లో పింఛన్ అందజేత

పులిచెర్ల(కల్లూరు): పులిచెర్లకు చెందిన ఫాతిమాబీ అనారోగ్యంతో బాధపడుతూ తిరుపతి స్విమ్స్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతోంది. గురువారం ఈమెకు స్థానిక వలంటీరు తిరుపతిలోని స్విమ్స్ ఆస్పత్రికి వెళ్లి ఫాతిమాబీకి పింఛన్ అందజేశారు.

పింఛన్ల పంపిణీ

సదుం: మండంలో సామాజిక భద్రతా పింఛన్ల పంపిణీ గురువారం ఉదయం నుంచే ప్రారంభమైంది. 18 పంచాయతీల పరిధిలో గృహసారథులు, వలంటీర్లు, సచివాలయ కన్వీనర్లు, ప్రజాప్రతినిధుల ఆధ్వర్యంలో పింఛన్లను పంపిణీ చేశారు. వేకువజామునే పింఛన్ అందడంపై లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేశారు.

ముగిసిన మహాభారత యజ్ఞం



పాండవులను ఊరేగిస్తున్న దృశ్యం

గుడిపాల: వసంతాలతో గురువారం మహాభారత యజ్ఞం ముగిసింది. మండలంలోని వసంతాపురంలో 35వ సారి మహాభారత యజ్ఞం మే 14న ప్రారంభించి మే 31తో పూర్తయ్యింది. ఈ క్రమంలో ద్రౌపదీ, అర్జున, భీమసేనులతో పాటు నకుల సహదేవులు, శ్రీకృష్ణస్వామి ఉత్సవమూర్తులను ఊరేగించి వసంతాలతో ముగించారు.

ఇక్కడ పిల్లలు అదృశ్యం..అక్కడ ప్రత్యక్షం



పిల్లలను అప్పగిస్తున్న ఎస్ఐ లక్ష్మీకాంత్

గుడుపల్లె: మండలంలోని గుడికొత్తూరు గ్రామానికి చెందిన వాసు(12), కామాక్షి(9) ఇంటి నుంచి వెళ్లి పోయినా.. రెండు గంటల్లో ఎస్ఐ లక్ష్మీకాంత్ పోలీసుల సహకారంతో పట్టుకున్నారు. వివరాలు గుడికొత్తూరు గ్రామానికి చెందిన గోవిందప్ప భార్య గౌరమ్మ కుమారుడు వాసు, కుమార్తె కామాక్షిని తల్లిదండ్రులు శ్రీనివాసులు, రామక్క వద్ద వదిలి బెంగళూరులో కూలీ పనులు చేసుకుని జీవనం సాగిస్తున్నాడు. గురువారం పిల్లలు అవ్వాతాత వద్ద గొడవ పడి ఇంటి నుంచి వెళ్లి పోయారు. పిల్లలు ఎంత సేపటికీ ఇంటికి రాకపోవడంతో వారు గుడుపల్లె ఎస్సై లక్ష్మీకాంత్‌కు ఫోన్ చేసి సమాచారమిచ్చారు. ఆయన సిబ్బందితో కుప్పంలోని బస్టాండ్, రైల్వేస్టేషన్, చెరువుల వద్ద పోలీసులను పంపించి గాలించారు. రైల్వే స్టేషన్ వద్ద రైలు కోసం వేచి ఉన్న ఇద్దరు పిల్లలను పోలీసులు పట్టుకున్నారు. వారిని క్షేమంగా గుడికొత్తూరులోని అవ్వాతాతకు అప్పగించారు. పిల్లలను జాగ్రత్తగా చూసుకోవాలని ఎస్ఐ వారికి హితవు పలికారు. రెండు గంటలలో పిల్లలను పట్టుకుని అప్పగించినందుకు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.

వలంటీర్ల సేవలు ప్రశంసనీయం



సన్మానం అందుకున్న వలంటీర్లతో చైర్మన్ అలీమ్‌బాషా

పుంగనూరు: మున్సిపాలిటీలో పని చేస్తున్న వలంటీర్ల సేవలు ప్రసంశనీయమని మున్సిపల్ చైర్మన్ అలీమ్‌బాషా కొనియాడారు. గురువారం పట్టణంలోని 16వ వార్డు సచివాలయంలో వలంటీర్లకు వందనం కార్యక్రమంలో భాగంగా వలంటీర్లకు సన్మానం చేశారు. మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి సొంత నిధులతో కొనుగోలు చేసి వలంటీర్లకు పంపిన దుస్తులను చైర్మన్ పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతి రోజు ప్రజల ఇళ్ల వద్దకు వెళ్లి వలంటీర్లు సేవలు అందిస్తున్నారన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పాటు చేసిన వలంటీర్ల వ్యవస్థ ఆదర్శంగా నిలిచిందని స్పష్టం చేశారు. స్థానిక నాయకులు లక్ష్మణ్‌రాజు, కృష్ణారెడ్డి, బావాజాన్ తదితరులు పాల్గొన్నారు.